మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# కమిషనర్.. నీ పద్ధతి మార్చుకో..

- కార్మికులపై అసభ్యంగా ప్రవర్తిస్తావా..
- మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ తీరును నిరసిస్తూ కార్యాలయాన్ని ముట్టడించిన సిఐటియు నాయకులు, కార్మికులు



మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మున్సిపల్ కార్మికులపై అసభ్యంగా మాట్లాడుతూ దుర్భాషలాడిన మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తన పద్ధతి మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. కమిషనర్ తీరును నిరసిస్తూ శనివారం మునిసిపల్ కార్మికులు ర్యాలీగా కమిషనర్ ఛాంబర్‌ను ముటడించి కమిషనర్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మున్సిపల్ కమిషనర్ తన పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. కార్మికుల పట్ల అసభ్యంగా కించపరిచే మాటలు, కార్మికులపై చేయి ఎత్తడం, కుర్చీ లేపడం, ప్రజల ముందే అవమానపరచడము ఇలాంటివి మానుకోపోతే తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కిల్లే గోపాల్ మాట్లాడుతూ మున్సిపల్ చరిత్రలోనే ఎన్నడూ ఎరగని ఘటనలు కార్మికులు ఎదుర్కొంటున్నారని దూషణలు, దుర్మార్గ విధానాలు కమిషనర్ మానుకోవాలని హితవు పలికారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ ఎంతోమంది కమిషనర్లను కార్మికులు చూశారని, సావధానంగా నచ్చజెప్పి పనులు చేయించాల్సిన అధికారి పోలీస్ అధికారులను మించి వ్యవహరించడం తగదని, ఆయన తన వైఖరి మార్చుకొని కార్మికులను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల వెంకటేశు, ఎర్ర నరసింహులు మాట్లాడుతూ కార్మికులను చీమల కన్నా అధ్వానంగా కమిషనర్ చూస్తున్నాడని, ఎస్సీ ఎస్టీ, బీసీ కార్మికులైనందువల్లే కించపరచడం, అవమానపరచడము, బెత్తం ఎత్తడం లాంటి పనులు చేస్తున్నాడని కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా అపరిష్కృతంగా పెట్టాడని, సమస్యలు పరిష్కరించని కమిషనర్ కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరించడం మానుకోపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి చంద్రకాంత్, టౌన్ కార్యదర్శి రాజ్‌కుమార్, భవననిర్మాణ కార్మిక జిల్లా కార్యదర్శి వరదగాలన్న, మున్సిపల్ యూనియన్ నాయకులుప్రభాకర్, బాలరాజు, ఉదయ్ కుమార్, వెంకటయ్య, వెంకటేశు, తిరుపతయ్య, చందు, చిన్న కృష్ణ, శివరాజు, కేశవులు, కృష్ణ, సాగర్ రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ డౌన్ డౌన్, కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేసి మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు.

# కలెక్టరేట్‌లో "రస్సెల్స్ వైపర్"
# పాముల కలకలం

- కలెక్టరేట్‌లో రెండు, రవితేజ స్కూల్ వెనకాల మరొకటి.. స్నేక్ క్యాచర్ సహాయంతో పట్టివేత
- వంశీని అభినందించిన కలెక్టర్ బాదావత్ సంతోష్



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన ప్రాంగణంలో శనివారం ఉదయం "రస్సెల్స్ వైపర్" పాములు కలకలం రేపాయి. భవన ప్రాంగణంలో పచ్చదనం కోసం ఏర్పాటుచేసిన మొక్కల మధ్య రెండు పాములను గుర్తించి కలెక్టర్ కార్యాలయ సిబ్బంది స్నేక్ క్యాచర్ తెప్ప వంశికి సమాచారం ఇవ్వడంతో స్టిక్‌తో అక్కడికి చేరుకొని పాములను పట్టుకున్నాడు. అప్పటి వరకు అందరూ కొండచిలువలుగా భావించిన అవి రస్సెల్స్ వైపర్" అనే జాతికి చెందిన విషపూరితమైన పాముగా స్నేక్ క్యాచర్ వంశీ తెలిపాడు. అనంతరం పట్టుకున్న పామును ప్లాస్టిక్ డబ్బాలలో బంధించి సురక్షితంగా బుద్ధారం గండి అడవిలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా స్నేక్ క్యాచర్ తెప్ప వంశీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రస్సెల్స్ వైపర్" జాతికి చెందిన పాములు మనుగడ సాధిస్తున్నాయని ఇవి అనేక ప్రాంతాలలో నిత్యం కనిపిస్తున్నట్లు వంశీ తెలిపాడు. నాగర్‌కర్నూల్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం పట్టుకున్న రెండు పాములు ఒక మగ, ఆడదిగా ఆయన వివరించారు. మేటింగ్ సమయంలో ఈ పాములు కలిసి ఉంటాయని వివరించాడు. మరొక ఇదే జాతికి చెందిన పామును హౌసింగ్ బోర్డ్ కాలనీ వద్దగల రవితేజ పాఠశాల వెనుక భాగంలో శరత్‌బాబు అనే వ్యక్తి ఇంట్లో పామును కూడా పట్టుకోవడం జరిగిందని వంశీ తెలిపాడు. నాగర్‌కర్నూల్ పట్టణంతో పాటుపరిసర ప్రాంతాల ప్రజలు ఇలాంటి పాములు కనిపిస్తే వాటికి హాని కలిగించకుండా తమకు(9703476691) నెంబర్‌కు సమాచారం అందిస్తే వాటిని సురక్షితంగా పట్టుకొని అటవీ ప్రాంతాలలో వదిలిపెట్టడం జరుగు తుందని వంశి వివరించారు. వంశీని అభినందించిన కలెక్టర్ కలెక్టర్ కార్యాలయ ఆవరణ లో 2 విషపూరితమైన పాములను పట్టుకొని సురక్షితంగా అడవిలో వదిలిపెట్టిన తెప్ప వంశీని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తన ఛాంబర్‌లో అభినందించారు. ఆయనతో పాటు అమ్రాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుమన్ కూడా స్నేక్ క్యాచర్‌గా అనేక పాములు పట్టుకున్నట్లు వంశీ తెలిపారు. మహమ్మద్ మాసూమ్ తదితరులు ఉన్నారు.

# బీజేపీ జోష్..

- ఢిల్లీ పీఠం దక్కించుకోవడంపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సంబురాలు
- తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామంటూ ధీమా..



మహబూబ్‌నగర్‌లో సంబురాలు జరుపుకుంటున్న బిజెపి నాయకులు

**మహబూబ్‌నగర్‌బ్యూరో, జడ్చర్ల, ఫిబ్రవరి 8, ప్రభాత వార్త:** ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి గెలిచిన సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి సీట్లు పంచి పెట్టారు. మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో బిజెపి జిల్లా అధ్యక్షులు పి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్ అబద్దాలను నమ్మలేదని, అవినీతి ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి విముక్తి కోరుకున్నారని తెలిపారు. మోడీ పాలనను ఢిల్లీ కేంద్రం లో కూడా ఉండాలనే ఉద్దేశంతో దేశం కోసం ధర్మం కోసం పనిచేసే భారతీయ జనతా పార్టీకి ఢిల్లీ ప్రజలు అండగా నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణలోను అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ పార్టీనీ, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలు నమ్మటం లేదని, రానున్న రోజుల్లో తెలంగాణలోనూ బిజెపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి పద్మజా రెడ్డి, రాజేందర్ రెడ్డి, పాండురంగారెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, నందిపేట రాజు, కొండయ్య, నాగరాజు, సంపత్, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

**జడ్చర్లలో:** ఢిల్లీలో బిజెపి గెలిచిన సందర్భంగా జడ్చర్ల పట్టణంలో బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఏర్పడి ఎన్నికలలో గెలిపించడం జరుగుతుందన్నారు. తెలంగాణలోనూ బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి గెలిచి తెలంగాణలో పార్టీ పట్టు సాధిస్తుందన్నారు. కార్య క్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంబీ బాలకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ముచ్చర్ల కృష్ణయ్య, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి ఎడ్లబాలవర్ధన్‌గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి బుక్క నవీన్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, ఉపాధ్యక్షులు మురళీకృష్ణ,

–మిగతా4లో..

# గల్లీలో బీజేపీ.. ఢిల్లీలో బీజేపీ

- బీజేపీ రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి



స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ఎన్నికలలో బీజేపీ పార్టీ భారీ విజయం సాధించిన సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో బీజేపీ నాయకులు స్వీట్లు పంచుకొని టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ జాతియ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో దేశవిచ్ఛిన్న శక్తులైన ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీలను ఢిల్లీ ప్రజలు తరిమేశారని, గత కొంత కాలంగా దేశ రాజధానిని పీడిస్తున్న 2 పార్టీలను పక్కకు పెట్టి ఢిల్లీకి రక్షణగా నిలిచే బీజేపీ పార్టీని గెలిపించారన్నారు. తీవ్ర అవినీతిలో కూరుకుపోయిన కేజ్రీవాల్‌ని సైతం ఓడగొట్టారని, దేశ రాజధానిలోనే నివాసం ఉండే సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మేనకాగాంధీ ముగ్గురు కూడా కనీసం మూడు సీట్లను గెలిపించుకోలేకపోయారని ఆయన వాపోయారు. ఢిల్లీ గాడిద గుడ్డు అని విమర్శించిన రేవంత్‌రెడ్డికి ఢిల్లీ ప్రజలు గాడిద గుడ్డు చేతిలో పెట్టారని విమర్శించారు. భవిష్యత్తులో తెలుగు రాష్ట్రాలలో కూడాఇదే పరిస్థితి ఉంటుందన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసి కష్ట పడి గల్లిలో బీజేపీ... ఢిల్లీలో బీజేపీ నినాదాన్ని నిజం చేయా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్వ కుర్తి కన్వీనర్ యెన్నం శేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బండెల రాంచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య కృష్ణగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు నీరుకంటి రాఘవేందర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నూరేడ్ల శేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండోజు గంగాధర్, మండల అధ్యక్షులు నరేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్, నాయకులు మాయని రాజశేఖర్, లక్ష్మీనరసింహ, శక్తి కేంద్రం ఇంచార్జీలు కుడుముల రాంరెడ్డి, కొల్లూరి శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు, బిజెపి అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం
# నాణ్యమైన భోజనం అందించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



హాస్టల్ టీ తాగుతున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. శనివారం ధరూర్ మండలంలోని మార్లబీడు గ్రామంలో ఉన్న కేటీ దొడ్డి ఎంజేపీటి బీసి డబ్ల్యూఆర్ ఈఎస్ బాలుర పాఠశాలలో విద్యార్థులతో కలిసి కలెక్టర్ రాత్రి బస చేసి, ఉదయం విద్యార్థులతో కలిసి దినచర్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మెనూ ప్రకారం శనివారం విద్యార్థులతో కలిసిబూస్ట్ తాగారు. పాఠశాలలో ఉదయం విద్యార్థులతో పరస్పర సంభాషణ నిర్వహించి, తరగతి గదులు, రిజిస్టర్స్, మెనూ, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలంటే క్రమశిక్షణ, ప్రయత్నం, తమపై విశ్వాసం ఉండాలని అన్నారు. లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయడం అవసరం అని తెలిపారు. చదవడమే కాకుండా, దాని అసలైన అర్థాన్ని, ప్రాముఖ్యతను పూర్తిగా గ్రహించాలని, భవిష్యత్తులో ఆ జ్ఞానం ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకోవాలని సూచించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు లాజికల్ ఆలోచనను అభివృద్ధి చేసుకుంటూ చదవాలని, రివిజన్ చేయడంతో పాటు మోడల్ పేపర్ల సహాయంతో ప్రాక్టీస్ కొనసాగించాలని అన్నారు. ఉదయం, రాత్రి స్టడీ అవర్స్‌ను పూర్తిగా ఉపయోగించుకుని చదువుపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. విద్య మాత్రమే కాకుండా, శారీరక ఆరోగ్యాన్ని కూడా అభివృద్ధి చేయాలని, అందుకోసం విద్యార్థులంతా ప్రతిరోజూవ్యాయామం చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకొని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. పాఠశాలలో హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్ లకు శోకాజ్ నోటీసులు జారీ చేసి, ఆహార నాణ్యత పర్యవేక్షణలో జరిగిన లోపాలకుసమాధానం ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు తగిన ఆహారం అందించడంలో జాప్యం, నాణ్యత లోపం ఉన్నందుకు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, మెనూకు అనుగుణంగా విద్యార్థులకు పోషకాహారం తప్పనిసరిగా అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరు నమోదును రిజిస్టర్ ను పరిశీలించి, విద్యార్థులు తరచుగా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని సూచించారు. పాఠశాల పరిసరాలనుఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తల్లిదండ్రుల కృషిని వృథా చేయకుండా చదువుపై పూర్తి దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థి తనకు తాను రోల్ మోడల్‌గా నిలిచేలా ప్రయత్నించాలని కలెక్టర్ మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

**ధన్వాడ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, పోటీ పరీక్షల గురించి, లీడర్‌షిప్‌లక్షణాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నయ్యలు మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. కాలేజీల్లో

–మిగతా4లో..

# క్రీడల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



బాక్స్ క్రికెట్ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి8 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా క్రీడల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, యువత ఉన్నత చదువులతోపాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణం 22వ వార్డు బాలాజీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ క్రీడా ప్రాంగణాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఇంత పెద్ద బాక్స్ క్రికెట్ ప్రాంగణాన్ని ఏర్పాటుచేసి క్రీడా శిక్షణను ఇస్తున్న యువకులు చంద్రకాంత్, సాయికాంత్ భాను ప్రకాష్, గిరీష్ లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల క్రికెట్ క్రీడాకారులుఈ క్రీడా ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్రీడల వలన జాతీయ అంతర్జాతీయ స్థాయిలోను గుర్తింపు పొందవచ్చునని దాంతో జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, సొంత గ్రామానికి పేరు ప్రఖ్యాతలు చేకూరుతాయని అన్నారు. యువకులు ఉన్నత ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూనే ఇలాంటి స్వయం ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల భవిష్యత్తు బాగుంటుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్ గోవర్ధన్ సాగర్, జిల్లాయూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, వనపర్తి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, మాజీ కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కుట్టుశిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే:** వనపర్తి పట్టణంలోని 22వ వార్డు బాలాజీనగర్ లో గల కుట్టుశిక్షణ కేంద్రాన్ని శనివారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకురాలు హసీనాతో శిక్షణ కేంద్ర వివరాలను అడిగితెలుసుకున్నారు. గతంలో రామానంద తీర్థ స్వచ్ఛంద సంస్థ వారు ఈ కేంద్రంను ఏర్పాటు చేశారని, తదనంతరం తామే కొనసాగిస్తూ నేటి వరకు 2 నుంచి 3 వేల మంది మహిళలకు కుట్టు శిక్షణను ఇచ్చామని ప్రస్తుతం ఈ కేంద్రంలో 30 కుట్టుమిషన్లు ఉన్నాయని ఇందులోను అత్యాధునికంగా లోడింగ్, కాలర్, కాజా, బటన్, కుట్లను కుట్టేందుకు సైతం మిషన్లు ఉన్నాయని ఆమె తెలిపారు. ప్రస్తుతం రెడీమేడ్ దుస్తులకు దీటుగా తాము కూడా డ్రస్సులుకుడుతున్నామని తమకు ప్రభుత్వ సహాయ సహకారాలు ఉండేలా చూడాలని వారు ఎమ్మెల్యే ను కోరారు. ఇందుకు సానుకులంగా స్పందించిన ఎమ్మెల్యే కొత్త శిక్షణ కేంద్రాన్ని బలోపేతం చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని మహిళలకు హామీ ఇచ్చారు.

# కేసుల విచారణ వేగవంతం..

- కొత్త చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్




మాట్లాడుతున్న ఎస్పీ జానకి ధరావత్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** భారత న్యాయ సంహిత కొత్త చట్టాల ద్వారా కేసుల విచారణ మరింత వేగవంతం అవుతుందని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ తెలిపారు. మహబూబ్‌నగర్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ నేతృత్వంలో పోలీసు అధికారులకు నూతన న్యాయ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వైజర్ రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు ద్వారా నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన నేర చట్టాలు (బిఎస్ఎన్, బిఎన్ఎస్, ఎన్ఎస్ఎస్) పై అధికారులకు పూర్తి అవగాహన కల్పించారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ నూతన చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తు, విచారణలో పాటించవలసిన నూతన, విధానాల మీద క్రింది స్థాయి సిబ్బంది నుండి ఉన్నత స్థాయి అధికార వరకు అందరు సంపూర్ణ సమజ్ఞానం, అవగాహన కలిగిఉండాలని ఎస్పీ పోలీసుఅధికారులకు, సిబ్బందికి సూచించారు. సమాజంలో శాంతిభద్రతలు కాపాడటంలో నూతన చట్టాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీస్ శాఖ నూతన చట్టాలను సమర్థంగా అమలు చేసే దిశగా ముందుకెళ్తుందని ఎస్పీ తెలిపారు. నూతన చట్టాలను సమర్థంగా అమలు చేయడానికి మహబూబ్‌నగర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ఇకమీదట కూడా నిర్వహిస్తామన్నారు. అనంతరం లీగల్ అడ్వైజర్ రాములు నూతనంగా అమలులోకి వచ్చిన భారత న్యాయ నియమావళి (బిఎన్ఎస్), భారత సాక్ష్య నిబంధన (బిఎస్ఎన్), భారత న్యాయపరమైన భద్రతా నిబంధన (ఎన్ఎస్ఎస్) గురించి వివరించారు. కొత్త చట్టాలలో వచ్చిన మార్పులను అధికారులకు వివరించడంతో పాటు కేసుల దర్యాప్తును నూతన చట్టాల ప్రకారం మరింత వేగవంతం చేసే మార్గదర్శకాలను అందించడం, అరెస్టు ప్రొసీజర్స్, లాండ్‌డిస్పుట్, కేసులలో ఆడియో, వీడియో రికార్డింగ్, సామాజిక అసౌకర్యానికి కారణమయ్యేనేరాలపై చర్యలు తీసుకునే విధానాలపై వివరించారు. ఈ చట్టాల ప్రకారం పోలీసుల బాధ్యతలు, దర్యాప్తులో మార్పులు, న్యాయపరమైన చర్యలు ఎలా ఉండాలనే అంశాలపై స్పష్టత ఇచ్చారు. డిజిటల్ నేరాలు, మహిళల భద్రత, పిల్లల రక్షణ, సైబర్ నేరాలపై కొత్త చట్టాలు ఎలా సహాయపడతాయో వివరించారు. అనంతరం లీగల్ అడ్వైజర్ రాములుని ఎస్పీ శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీరాములు, డిఎస్పివెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి డిఎస్పి రమణారెడ్డి, డిటిసి డిఎస్పీ గిరిబాబు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్, జడ్చర్ల ఇన్స్‌పెక్టర్ ఆదిరెడ్డి, జడ్చర్ల రూరల్ సిఐ నాగార్జున గౌడ్, ఉమెన్ పిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండాలి

ఈవీఎం గోడౌన్లను పరిశీలించిన కలెక్టర్ విజయేంద్ర బోయి



ఈవీఎం గోడౌన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన ఈవీఎం గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతినెల ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల తనిఖీలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి) ఆవరణలో ఉన్న ఈవియం గోదాంను భద్రపరచిన గదుల సీల్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఈవీఎం గోదాము భద్రతకు నియమించిన సిబ్బంది హాజరయ్యే విధంగా పోలీసు బందోబస్తు తదితర అంశాలను, ఈవీఎం ఆవరణను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి కెవివి రవి కుమార్, ఎన్నికల విభాగం డి.టి జాఫర్ తదితరులు ఉన్నారు.

## వార్త పత్రిక కథనానికి ఎఫెక్ట్

- రోడ్డు దుమ్ముతో నరకయాతన శీర్షికకు స్పందన
- వాటర్ ట్యాంకర్లతో దుమ్మును నియంత్రిస్తున్న నిర్వాహకులు

**నవాబుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మొన్న గురువారం వార్తా కథనం దుమ్ముతో నరకయాతన అనే వార్త కథనం పత్రికలు రావడంతో రోడ్డు విస్తరణ నిర్వాహకులు దుమ్ము లేవకుండా చర్యలు చేపట్టారు. నవాబుపేట మండల కేంద్రం నుంచి లింగంపల్లి వరకు లింగంపల్లి నుండి తిరుమలపూర్ వెళ్లే మార్గం వరకు రోడ్డు విస్తరణ పనులలో భాగంగా ధుమ్ము, దూళితో వాహనదారుల నరకయాతన పడుతున్నారని వార్త ప్రచురించడంతో అధికారులు స్పందించి వాటర్ ట్యాంకర్లతో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్డుపై నీరు జల్లుతూ రోడ్డు విస్తరణ పనులు జరపాలని రోడ్డు విస్తరణ నిర్వాహకులకు కార్మికులకు హెచ్చరించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వాటర్ ట్యాంకర్లతో తడి చేస్తూ పనులు సాగించాలని చేసిన కథనంతో అధికారులు స్పందించారు.



వాటర్ ట్యాంకర్‌లతో దుమ్మును నియంత్రిస్తున్న నిర్వాహకులు

## ఉపాధి హామీ సామాజిక తనిఖీ

### చెట్ల గుంతలు తీసి మొక్కలు నాటలేదని గుర్తింపు



ఉపాధి హామీ పనులపై తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి8 ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో జాబ్ కార్డు ద్వారా చేసిన పనులకు గాను మండలంలో 15 సామాజిక బృందం సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం గానుగట్టుతాండాలో 2023-24 సంవత్సరానికి కూలీలతో చేపట్టిన పనులు అవకతవకలు, పనుల నాణ్యత, బిల్లుల చెల్లింపు కూలీలతో అడిట్ సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. పరిశీలించి రికార్డులను పరిశీలించారు. తనిఖీలో భాగంగా గ్రామంలో 90 మంది కూలీలు జాబు కార్డులు కలిగి ఉన్నారని 8 లక్షల రూపాయలు పనులు చేసినట్టు గుంతలు తీసి మొక్కలు నాటలేదని వాచ్ అండ్ వాచ్‌లో అదనంగా ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీరు అందించారని సామాజిక తనిఖీ డిఆర్పి శంకర్ గుర్తించారు. సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్‌జీ, పంచాయతీ కార్యదర్శి మాధురి, సిబ్బంది హుస్సేన్‌టీ, ఏ.శివలీల, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణయ్య, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

### మురుగునీరు పోవడానికి డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో..

## కంపు కొడుతున్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల



తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో 600 లకు పైగా చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటుమురుగునీరు పోవడానికి డ్రైనేజ్ సౌకర్యం లేకపోవడంతో పాఠశాల ప్రహరిగోడ దగ్గర నిలిచిపోయి, అందులోనే పందులు పొర్లాడుతూ దుర్గంధం వెదజల్లడంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతుందని, పరిస్థితి ఇలానే ఉంటే ఇందులో చదువుతున్నమా పిల్లలు అస్వస్థకు గురవుతారని తహసిల్దార్ కార్యాలయానికి విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకొని తహసిల్దార్ కార్తీక్‌కుమార్‌కు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రంఅందించారు. ఈ సందర్భంగాతహసిల్దార్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అందించిన వారిలో అశోక్, వెంకటయ్య, బాల్‌చెన్నయ్య, పరశురాములు, దశరథం, రమేష్, బాలస్వామి, సైదులు, మల్లేష్, వినోద్, శ్రీను, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

## సీసీ రోడు పనుల పరిశీలన



సీసీ రోడు పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కొత్తకోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణ పరిధిలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీకృష్ణ దేవాలయానికి వనపర్తి మెయిన్ రోడ్ నుండి దేవాలయం వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్ పనులను శనివారం కొత్తకోట మండల కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు రోడ్ పనులను పరిశీలిస్తున్నట్లు సీడ్ చైర్మన్ గొల్లబాబు తెలిపారు. ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం కొత్తకోట శ్రీ కృష్ణ దేవాలయానికి కొద్ది రోజుల క్రితం 60 లక్షలతో సిసి రోడ్డు భూమి పూజ లో పాల్గొని త్వరలో ప్రారంభం కానున్న నూతన దేవాలయ సిసి రోడ్డును దేవాలయ ప్రారంభోత్సవం కంటే ముందే పూర్తి చేస్తానని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆలయ కమిటీకి మాట ఇవ్వడం జరిగిందని పూర్తికావస్తున్న సిసి రోడ్ పనులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీను, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు మిషేక్, జిల్లా కార్యదర్శి బోయోజ్, జెసిబి రాములు, కృష్ణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలి

**వెల్దండ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని రాష్ట్ర మాడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి అన్నారు. మండల కేంద్రంలోని మాడల్ పాఠశాలను శనివారం ఉదయం రాష్ట్ర మాడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌తో కలిసి పాఠశాల గదులను పరిశీలించడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి మాట్లాడుతూ 10వ తరగతితో పాటు 12వ తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు 100 ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఎంఈఓ చంద్రుడు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## గార్లపాడు గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలి



ఉద్యమం నిర్వహిస్తున్న మండల సాధన సమితి నేతలు

**కోయిలకొండ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** మండలంలోని గార్లపాడు గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలని మండల సాధన సమితి కో కన్వీనర్ వెంకట్రాంరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపే ఆర్లపాడు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని ఆయన అన్నారు. గార్లపాడు గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని ప్రతినిత్యం చుట్టూ గ్రామాల ప్రజలు ఉద్యమానికి మద్దతు తెలపడం జరుగుతుందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు గార్లపాడు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల సాధన సమితి నేతలు దమాయపల్లి వెంకటేష్, జంగం ఆంజనేయులు, పారుపల్లి శ్రీనివాసులు, బోయిని వెంకటయ్య, పెంటప్ప, మొగులయ్య, ఆంజనేయులు, అరవింద్, చెన్నయ్య స్వామి, రాములు, తారాసింగ్, శ్రీనివాసులు తత్తర్లు పాల్గొన్నారు.

## అమ్మవారి ఉత్సవాలకు అంకురార్పణ

**కొత్తకోట ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణం లో కొలువై ఉన్న శక్తి స్వరూపిణి శ్రీ అంబ భవాని శంకర ఆలయంలో ఈ నెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు నూతన ధ్వజస్థంభ ఏర్పాటు కొరకు మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు ఉత్సవాలు నిర్వాహకులు నిర్వహించారు. అందులో భాగంగా మొదటి రోజైన శనివారం అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన శిఖరములపైఏర్పాటు చేయుటకు సిద్ధం చేసిన కలశాలను స్థానిక రాఘవేంద్రస్వామి ఆలయం నుండి శ్రీ భవానిశంకర ఆలయం వరకు మేళాతాళాలు, బాజా భజంత్రీలు, కోలాటాలు, పలకల భజనలు, డీజేలతో అమ్మవారి భక్తి పాటలతో సంప్రాదాయ బద్దంగా భజనలు చేస్తూ శోభయాత్రగా ఆలయానికి చేరుకుని అక్కడ శాస్త్ర ప్రకారం శ్రీశైలం మఠం సారంగదర కోటేశ్వర స్వామి వారు, ఆలయ అర్చకులుమఠం సాదాశివుడు, మఠంఆనందయ్య గార్లు నూతన కళాశాలకు, నవగ్రహాలకు, ధ్వజస్థంభాలకు జలదీవాసం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రలో దాదాపు 1000 మంది వరకు భక్తులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలు మహిళలు, హిందూవాహిని సభ్యులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. శోభయాత్రలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు పొగాకు మహేష్ బాబు సోదరులు ఆలయం దగ్గర అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వాహకులు పొగాకు మహేష్ బాబు, రాఘవేంద్ర ప్రసాద్, పొగాకు అనీల్ కుమార్, బల్లే శ్రీధర్ పట్టణ ప్రముఖులు పాపయ్యగారి చంద్రశేఖర్‌రెడ్డి, గుండ్రాతి వామన్ గౌడ్, బీసం చెన్నకేశవ రెడ్డి, పొగాకు విశ్వేశ్వర్, గుంత మౌనిక తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

## రేషన్ కార్డుల దరఖాస్తులను డిజిటలైజేషన్ చేయాలి

### ◆ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** ప్రజా పాలన, గ్రామ సభల్లో రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను డిజిటలైజేషన్ చేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలుసంచిత్ గంగ్వార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులపై అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లుతో కలిసి ఎంపీడీఓలు, తహాశీల్దారులతో వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అతి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీఓలు, మున్సిపల్ సిబ్బంది బిజీగా ఉన్నందున ప్రజాపాలన, గ్రామసభల సమయంలో వచ్చిన రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులను తహాశీల్దార్లకు సమర్పించవలసిందిగా ఆదేశించారు. తహాశీల్దార్లు ఈ దరఖాస్తులను తమ అందుబాటులోకి తీసుకొని ఫిబ్రవరి 12వ తేదీలోపు డేటా ఎంట్రీ చేసి డిజిటలైజ్ చేయించాలని ఆదేశించారు. దరఖాస్తులను డేటా ఎంట్రీ చేసేటప్పుడు జాగ్రత్తగా చేయాలని, బయటకు వెళ్లకూడదని నిర్దేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ యాదయ్య, ఎంపీడీఓలు, తహాశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం పేదలకు స్థలాలు చూపేవరకు పోరాటం ఆగదు

### ◆ సిపిఎం సీనియర్ నాయకులు ఎండి జబ్బర్

**అమరచింత, ఫిబ్రవరి8 ప్రభాతవార్త :** ఇండ్లు లేని పేదలకు గత ప్రభుత్వం పట్టాలిచ్చి 25 ఏళ్ళు గడుస్తున్న ఇప్పటివరకు స్థలాలు చూపడం లేదని ప్రభుత్వం పేదలకు స్థలాలు చూపేవరకు పోరాటం ఆగదని సిపిఎం వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు ఎండి జబ్బర్ అన్నారు. శనివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అమరచింత బస్టాండ్ లో పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు చూపాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎండి జబ్బర్ మాట్లాడుతూ, ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు లేని పేదలకు ప్లాటుతో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని ఆయన అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో అనేక వాగానాలు చేసిన అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాజ్ పథకం ద్వారా దేశంలో కోటి ఇండ్లను మంజూరు చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందని కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు పేదలకు ఇచ్చిన ఇండ్లను చూపాలని ఆయన డిమాండ్ చేశారు. దుంపై కుంటలో పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు చూపాలని అనేక మార్లు గత ఎమ్మెల్యేలకు, జిల్లా కలెక్టర్‌కు మండలాధికారులకు అనేక వినతి పత్రాలు ఇచ్చిన సమస్యను పరిష్కరించేటట్లు విఫలమయ్యారని ఆయన అన్నారు. అలాగే మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని పేదలకు ప్లాట్లు ఇవ్వాలని ఐదు సార్లు కలిసి చెప్పిన పట్టించుకోవడంలేదనిఇప్పటికైనా ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ పేదలకు న్యాయం చేయాలని లేనిచో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జిఎస్ గోపి, బివెంకటేష్, అజయ్, ఆర్ ఎన్ రమేష్, శ్యాం సుందర్, రాఘవేంద్ర, చంటి, విజయ్, వీరితోపాటు మహిళలు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎండి జబ్బర్

## ప్రజా సంఘాల మహాధర్నా విజయవంతం చేయాలి

### ● సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దేశ్యానాయక్

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.దేశ్యానాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని రాయిచేడు గ్రామంలో గ్రామ సిపిఎం శాఖ సమావేశం నిర్వహించగా ఆ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రేపు సోమవారం హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ప్రజా సంఘాల మహాధర్నను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్, శివకుమార్, మండల కార్యదర్శి చింతల నాగరాజు, రాయిచేడు గ్రామ శాఖ కార్యదర్శి గొడుగు వెంకటయ్య, పార్టీ సీనియర్ నాయకులు గొడుగు చంద్రయ్య, నాగయ్యగౌడు, తిరుపతయ్య, లక్ష్మయ్య, శ్రీనయ్య, రామకృష్ణ, రమేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.



రాయిచేడ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

## మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

### ● జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

**గద్వాల, ఫిబ్రవరి8 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాల సభ్యులకుప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలపై అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ (రెవెన్యూ), నర్సింగరావు (ఎల్ బి), కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ లకు తెలిపారు. శనివారం ఐడిఓసి లోని కాన్ఫరెన్స్ హాల్ నందు సంఘాల బలోపేతానికి సిఆర్‌పి (కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్) వ్యూహం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సంఘాల శక్తిని పెంచడం, సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించడం, స్థానిక సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంలో సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమం ద్వారా (సిఆర్‌పి) కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు సంబంధిత గ్రామాలకు వెళ్లి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. గత విజయాలను పంచుకోవడం, గ్రామాల్లో తలెత్తే చిన్నసమస్యలను తక్షణమే పరిష్కరించ దంలో సహాయం చేయాలన్నారు. సంఘాలలో సభ్యత్వాన్ని పెంచడంతో పాటు సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందించడం వలన గ్రామాల్లో సామాజిక చైతన్యం పెరుగుతుందని అన్నారు. సంఘాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక వనరులు పెరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడి నరసింహులు, మహిళా సంఘాల అధ్యక్షురాలు సంగీత, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.



మహిళ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

## నూతన మండలాల కోసం గద్వాలలో సన్నాహక సమావేశం

**గద్వాల, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలో గద్వాల నియోజకవర్గంలో నూతన మండలాల కోసం ఆయాగ్రామాల ప్రజలు, నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సీనియర్ సిటీజన్ ఫోరం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఉద్యమానికి సిద్ధం అవుతున్నారు. ప్రత్యేక మండలాలు చేయాలని అనేక సంవత్సరాలుగా ప్రజలు కోరుతున్న విషయం అందరికీ తెలిసిందే. కొన్ని రాజకీయ కారణాల వల్లనే కొత్త మండలాలు కాలేదని, నూతన మండలాలను ఏర్పాటు చేయకపోతే భవిష్యత్తులో జరిగే జడ్పిటిసి, జిల్లా పరిషత్ ఎన్నికల్లో గద్వాల నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వస్తుందని అఖిల పక్షనాయకులు అంటున్నారు. ఇప్పటికే పెద్ద మండలాలుగా ఉన్న గట్టు, మల్దకల్ ధరూరు, గద్వాల మండలాలను విభజించి నూతన మండలాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పరిపాలన సౌలభ్యం కోసం గతంలో రెవెన్యూ ఫిర్కాలుగా ఉన్న ఉప్పేరు, పూడూరు లను కొత్త మండలాలుగాఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రజలు కోరుతున్నారు. అతి పెద్దదైన గట్టు మండలాన్ని బలిగేరా మాచర్ల, గ్రామాల పేరుతో నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ప్రజలు కోరిన నూతన మండలాలు ఆవిష్కరణ జరగలేదన్నారు. కొత్తగా అతిపెద్ద గ్రామంలో ఉన్న అల్లపాడు, దాని చుట్టుపక్కల ఉన్న గిరిజన గ్రామాలతో ఒక గిరిజన మండలాన్ని ఏర్పాటు చేస్తే గిరిజనులకు కూడా ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం లభిస్తుందని మేధావులు అంటున్నారు. కొత్త మండలాల అవశ్యకతఉందని ప్రజాస్వామికవాదులు ఆశిస్తున్నారు. గత ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేసిన మనము గద్వాల నియోజకవర్గంలో చేసుకోలేకపోయాం ఈ ప్రభుత్వం కూడా నూతన మండలాల ఏర్పాటుకు సుముఖంగా ఉందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి ఇప్పటికైనా నూతన మండలాల కోసం రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలనాయకులు, ప్రజాస్వామికవాదులు ప్రజా సంఘాలు, కుల సంఘాలు, ఆయా గ్రామాల ప్రజలు ఉద్యమానికీ ఏకమవుతున్నారు. ప్రజల సౌలభ్యం, సౌకర్యం కోసం ప్రజల వద్దకు పాలన కోసం, నూతన ప్రాంతాల అభివృద్ధి కోసం, ఆయా పెద్ద గ్రామాలు మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడం కోసంకొత్త మండలాలను ఏర్పాటుదిశగా అందరూ ఆలోచించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాజకీయాల కతీతంగా మన ప్రాంత అభివృద్ధి ధ్యేయంగా గద్వాల నియోజకవర్గంలో కొత్త మండలాల ఏర్పాటుకు అన్ని పార్టీలనాయకులు సహకరించాలన్నారు. రాజకీయ అవసరాలు, విద్య, వైద్య రంగాల అభివృద్ధి కోసం కొత్త మండలాలు ఉపయోగపడుతాయన్నారు. కొత్త మండలాల ఏర్పాటు అందరూ ముందుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ దిశగా ప్రారంభ దశలో ఆలోచించడానికి విద్యావంతులు, మేదా వులు, ఒక సన్నాక సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేస్తున్నారు. అఖిలపక్ష కమిటీకి అందరూ సహకరించి సోమవారం జరిగే మీటింగ్ ను జయప్రదం చేయవలసిందిగాఆయా గ్రామాలు, మండలాలుగా ఏర్పాటుకు గ్రామాలు పెద్ద ఎత్తున పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. ఐజ మండలంలోని మేడికొండ గ్రామ ప్రజలు కూడా ఈ సమావేశంలో పాల్గొనాలని అఖిల పక్ష నాయకులు కోరుచున్నారు

## బిజెపి ఆధ్వర్యంలో సంబరాలు

### దేశాన్ని నడిపించే ఎన్నికలు : బిజెపి నాయకులు

**ఆత్మకూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** దేశ రాజధాని ఢిల్లీలో బిజెపి ఎన్నికల్లో గెలిచి దేశాన్ని ముందుకు నడిపించే ఎన్నికగా బిజెపి భావిస్తుందని ఆత్మకూర్ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్ బిజెపి ఆత్మకూరు మండల అధ్యక్షులు అశోక్ ,భూపాల్ యాదవ్ తదితరులు అన్నారు. ఢిల్లీలో బిజెపి ఎన్నికల్లో గెలిచిన సందర్భంగా శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని గాంధీ చౌరస్తా నుండి స్వామి వివేకానంద విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి బిజెపి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ 27 సంవత్సరాల తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం శుభసూచకం అని పేర్కొన్నారు. అంతే కాకుండా దేశ ఆర్థిక స్థితిగతులను మార్చే ఎన్నికలుగా బిజెపి భావించి ప్రణాళిక బద్ధంగా దేశాన్ని ముందుకు నడిపించే విధంగా ముందుకు సాగుతుందని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, అనిల్ కుమార్‌గౌడ్, తమిళ్ విజయ్, బాలకృష్ణ ,వెంకటేష్ ,మండల సూరి ,ఆంజనేయులు, ఎల్లన్న ,మనోహర్‌గౌడ్ తదితరులతో పాటుగా పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు దీక్ష సభకు జనాలు భారీగా తరలిరావాలి

### ● మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

**మద్దూర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని కొత్తపల్లి మండల పరిధిలోని నిడ్జింత గ్రామంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శనివారం రోజు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవ తేదీ రోజు కోస్గిలో కేటీఆర్ అధ్యక్షతన జరిగే రైతు దీక్ష సభకు భారీ ఎత్తున జనాలు తరలి రావాలని కార్యకర్తల సమావేశంలో కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ సలీం, కోస్గి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరారెడ్డి, మద్దూరు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వంచర్ల గోపాల్, కొత్తపల్లి టిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి కిందపడి గీత కార్మికుడి మృతి



మృతి చెందిన గీత కార్మికుడు శ్రీనివాస్‌గౌడ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** నాగనూలు గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ (58) నిత్యం మాదిరిగానే తమ కుల వృత్తిలో భాగంగా కల్లు గీసేందుకు తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్ళాడు. ఈత చెట్టు పైకి ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ఒక్కసారిగా చెట్టుపై నుండి కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో శ్రీనివాస్‌గౌడ్‌ను హుటాహుటిన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాస్‌గౌడ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాస్‌గౌడ్‌కి భార్య ఒకూతురు, కొడుకు ఉన్నారు. నాగనూల్ గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాస్‌గౌడ్ మృతి తన వృత్తిలోనే మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలము కున్నాయి.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**నవాబుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన దార చెన్నమ్మ(55) సంవత్సరాలు, అనారోగ్యంతో హఠాన్మరణం చెందడంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు మాజీ సర్పంచ్ కొత్తగొల్ల బాలరాజు అంత్యక్రియల ఖర్చు నిమిత్తం రూ.20 వేలు అందజేయగా ఎస్సీ కాలనీ ప్రజాప్రతినిధులు నాయకులు కలిసి ఎవరికి తోచినంత వారు నగదు రూపంలో రూ. 4500లమృతురాలి కూతురుకు ఇవ్వడం జరిగింది. కుటుంబ సభ్యులు మాజీ సర్పంచ్‌కు కాలనీ వాసులకు అందరూ కలిసి సహాయం చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగొల్ల బాలరాజు, మాదాసు శాంతయ్య, మాదాసు బాలరాజు, కృష్ణయ్య, కోస్గిశంకర్, మాదాస్ కృష్ణయ్య, చెంచు చంద్రయ్య, చెన్నయ్య తదితరుల సమక్షంలో అందజేయడం జరిగింది.

## ప్లాస్టిక్ కవర్లను నియంత్రించాలని తనిఖీలు నిర్వహించిన మున్సిపల్ సిబ్బంది

**పెబ్బేరు, ఫిబ్రవరి8 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలో తెలంగాణ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం రోజు ప్లాస్టిక్ కవర్లను నియంత్రించాలని షాప్ లలో తనిఖీలు నిర్వహించగా 10కేజీల కవర్లు దొరికాయని మున్సిపల్ సిబ్బంది తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ కవర్లపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామని ఎవరి షాపుల్లో దొరికినట్లయితే వారిపై చట్టపరంగా జరిమానా విధించి చర్యలు తీసుకుంటామని కావున ప్రతి ఒక్కరు సహకరించి ప్లాస్టిక్ నిర్మూలనకు సహాయ సహకారాలు అందించాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ విధిగా బయటకు వెళ్లేటప్పుడు కూరగాయల గాని, కిరాణం షాపులకు గాని బట్ట సంచులు తీసుకపోవాలని బట్ట సంచులు వాడడం వల్ల ప్లాస్టిక్ కవర్లు నియంత్రించడం వలన పట్టణ పరిశుభ్రంగా ఉంటుందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది యోగేష్, బాలు, రాజు తదితరులు పాల్గొన్నారు,

## ఖిల్లాలో వ్యాధి నిరోధకాలపై తనిఖీ నిర్వహించిన జిల్లా వైద్యాధికారి

**ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** ఘణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ వైద్యాధికారిణి డాక్టర్ పరిమళ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గ్రామాలలో సార్వత్రిక వ్యాధి నిరోధక కార్యక్రమాలను ఏ విధంగా నిర్వహిస్తున్నారో ప్రత్యక్షంగా గ్రామాలలో పర్యటించి తెలుసుకున్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి రోడ్డు మీద తండా గ్రామాలలో వ్యాధి నిరోధకత టీకాలను ఏ విధంగా ఇస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. టీకాలను ఇచ్చే విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌తో పాటు ఎంపిహెచ్ఈఓ చంద్రయ్య, నర్సింలు పాల్గొన్నారు.

## పరమేశ్వర స్వామి జాతరకు ముమ్మర ఏర్పాట్లు

**ఆత్మకూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఈ నెల 26న శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభంకానున్న పరమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆత్మకూర్ జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. చర్ల పరమేశ్వర స్వామి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకుగాను గత శుక్రవారం పట్టణానికి చెందిన ప్రముఖుల చేత ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి పరమేశ్వర స్వామి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో అందుకు అనుగుణంగానే శనివారం రోజుజాతర ఉత్సవ కమిటీ అధ్యక్షులు దివాన్జీ వెంకట నరసింహారావు ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో ప్రారంభం కరుణ చర్ల పరమేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక మొత్తంలో తల్లిదండ్రుల విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తిరుగు చుట్టు ఉల్లకంప చెత్తను తొలగించడమే కాకుండా బ్రహ్మోత్సవాల నిర్వహించేందుకున్ని రకాలఏర్పాట్లు చేపట్టనున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు దామోదర్, మణి వర్ధన్ రెడ్డి లతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు భూమి పూజ

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం మల్‌రెడ్డిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పర్ణికరెడ్డి నిధులనుండి మంజూరు అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు కోసం శనివారం నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదశివారెడ్డి, వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంత్ భూమి పూజ చేశారు. అంతకుముందు పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలన్నారు. గ్రామీణ ప్రాంతాలఅభివృద్ధి కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సలహాదారుడు మాధవరెడ్డి, మండల అధ్యక్షులు కోయిలకొండ బాల్‌రెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షులు శివకుమార్, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బాలరాజ్, అశోక్ గౌడ్, సాయిలు, లాలప్ప, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, తంబలి మహేష్ పాల్గొన్నారు.

## మహిళలకు గొప్పవరం మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్




మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**గద్వాల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** గద్వాల్ స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో శనివారం మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్ యం.యస్.యస్.సి ఖాతాకు సంబంధించిన కరపత్రాలు గోడ పత్రికలను మహిళా ఉద్యోగి ఐనా కె.కళావతి పోస్ట్మాస్టర్ గద్వాల్ హెచ్.ఓ చేతుల మీదగా జారీ చేయడం జరిగిందని తపాలాశాఖ సహాయ పర్యవేక్షకులు సైదా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. యం.యస్.యస్.సి ఖాతా 2023 సంవత్సరపు కేంద్ర బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త పొదుపు పథకం ప్రత్యేకంగా మహిళాల కోసం ప్రవేశపెట్టబడింది. ఈ పథకానికి కనీస పెట్టుబడి రూ.1000/- గరిష్టంగా రూ.200000/- రెండు లక్షల వరకు పెట్టుబడి చేసుకోవచ్చు. ఈ పథకానికి రెండు సంవత్సరాల పెట్టుబడి గాను ప్రస్తుత ఆకర్షణమైన వడ్డీ రేటు రూ.7.5 శాతంగా ఉన్నది.ఈ ఖాతా మహిళలకు రక్షణ కల్పించడం కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి నది.ఈ ఖాతాలో మహిళలు ఖాతా తెరుచుటకు ఆఖరి తేదీ 31 మార్చ్ 2025 వరకు గడువు ఉంది. కావున మహిళా సోదరీమణులందరూ ఈ తపాలాశాఖ మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్.సైదా నాయక్ తపాలశాఖ సహాయ పర్య వేక్షకులు వారు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ యం.యస్.యస్.సి ఖాతా కరపత్రాలు గోడ పత్రికలు జారీ కార్యక్రమంలో మద్దమ్మ ఎంటీఎస్, బుజ్జి డాక్ సేవక్, రాజశేఖర్ పి.ఎ, బసంత్ రెడ్డి డి.పి యం, సుబ్రహ్మణ్యం పి.ఏ, ప్రశాంత్ పి.ఏ, మైసయ్య పి.ఏ, భాను ప్రసాద్ పి.ఏ, జగదీష్ డాక్ సేవక్, ఇస్మాయిల్ డాక్ సేవక్ గద్వాల్ ప్రధాన తపాలా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలోని శాంతినికేతన్ గ్రామర్ హైస్కూల్ పాఠశాలలో స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు ఇచ్చినటువంటి పాత్రలను చాలాచక్కగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వాసవి, కరస్పాండెంట్ గా శిరీష, జిల్లా కలెక్టర్ పాత్ర పోషించిన రవి రత్నం, అదనపు కలెక్టర్‌గా విష్ణు, డీఈఓ గా నాజి యా, ఎంఈఓగా మధుప్రియ,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులుగా ఊర్మిళ,సుప్రియ, విజయలక్ష్మి, వైష్ణవి, లక్ష్మి, శివకుమార్,రాహుల్, నరసింహ, ఏ.విష్ణు, చంద్రహాస్, కార్తీక్, సందీప్, శంకర్, హర్షవర్ధన్ , పీఈటీలుగా కె. శివరాజ్, ఈ.శ్రీనాథ్, శశాంక్‌రెడ్డి, ఎం.డి. ఫైజాన్లు తమకు ఇచ్చిన టువంటి పాత్రలను చక్కగా నిర్వహించి విద్యార్థిని విద్యార్థులను ఆకర్షించుకున్నారు. చిన్నారులు మాట్లాడుతూ నిజజీవితంలో మేము పోషించినటువంటి పాత్రలలో ఉండడానికి సాయశక్తుల ప్రయత్నిస్తామని వారు అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ డివి చారి మాట్లాడుతూ మా విద్యార్థులు చాలా చక్కని పాత్రను పోషించి నిజ జీవితంలో కూడా చిన్నారులు ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని కోరుతున్నామన్నారు.



**నవాబుపేట ఫిబ్రవరి 8 ప్రభాత వార్త:** మండల పరిధిలోని కారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. స్వయం పరిపాలనలో భాగంగా విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలిగా మౌనిక 10వ తరగతి,ఎంఈఓగా కీర్తి,డిఈఓగా అనూష, ఆర్‌జెడిగా స్నేహ, జిల్లా కలెక్టర్‌గా ప్రణయ్, వ్యవహరించారు.ఈసందర్భంగా ప్రధానోపా ధ్యాయుడు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న వారి సృజనాత్మకతను వెలికితీ యడానికి ఇలాంటి కార్య క్రమాలు ఉపకరిస్తాయని తెలియజేశారు. విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యా యుల పాత్ర వెలకట్టలేనిది అన్నారు. విద్యార్థి దశ నుండే కృషి పట్టుదల క్రమశిక్షణ ఉంటే చిన్న నాటినుండి లక్ష్యాలను పెట్టుకొనివాటినీ సాధించుకునే లక్ష్యంతో ముందడు గు వేస్తుంటే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థులంతా చక్కగా చదివి పదవ తరగతిలో 10 జిపిఏ సాధించాలని కోరారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఛాత్రోపాధ్యా యులు అందరికీ దశరథ్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు



పోలీసుల దాడుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి కొంత మంది డబ్బులు పందెం పెట్టుకుని రహస్యంగా పేకాట ఆడుతుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు దామరగిద్ద ఎస్సై రాజు,పోలీస్ సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న పదిమందిని పట్టుకొని వారి వద్ద నుండి 17,500/ రూ. .. 07 సెల్ ఫోన్లు, 10 ద్విచక్ర వాహనాలు, ఒకషిఫ్ట్, డిజైర్ కార్, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని పదిమంది వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్సై రాజు తెలిపారు. దాడుల్లో పట్టుబడిన వారిలో పట్టుబడిన వారిలో గడ్డమీది కంకప్ప, మద్దూరు మండలం రేణువట్ల గ్రామం, ఎండి హుస్సేన్, గుర్మిట్కల్ తాలూకా ఫుట్‌పాత్ గ్రామం, చాకలి బాలరాజు మద్దూర్, దేవరకొండ నరేందర్ మద్దూర్, సూర్య నాయక్ మద్దూరు మండలం ఖాజీపూర్ గ్రామం, సిరిగిన్నె వెంకటయ్య, మద్దూరు మండలం పల్లెర్ల గ్రామం, మేకల లాలప్ప, మద్దూర్ మండలం బీంపూర్ గ్రామం, నడిమింటి శ్రీను, మద్దూరు మండలం పెదరపాడు గ్రామం, మేకల లాలప్ప, మద్దూరు మండలం బీంపూర్ గ్రామం బంటు నారాయణ దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ గ్రామం వారు ఉన్నారు.

## రెండవ విడత ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

### ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 39 మంది గైర్హాజరు

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా వ్యాప్తంగా రెండవ విడత ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నేటి నుండి ప్రారంభమైనట్లు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. శుక్ర వారం జిల్లా పరీక్షల కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలోని 21 కళాశాలల్లో నిర్వహించబడుతున్న ప్రాక్టికల్ పరీక్షల తీరుతెన్నులను పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల బుద్ధారం, రావుస్ జూనియర్ కళాశాల, స్కాలర్స్ జూనియర్ కళాశాల, సీ.వీ.రామన్ జూనియర్ కళాశాల, జాగృతి జూనియర్ కళాశాల, త్రివేణి కళాశాలలను డిఏఈఓ సందర్శించి పరీక్షల రికార్డులను, మార్కుల నమోదును పరిశీలించారు. ఇంటర్ బోర్డు షెడ్యూల్ ప్రకారం పరీక్షల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్ల ప్రణాళికాబద్ధంగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్వితీయ సంవత్సరం ప్రయోగ పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా ఉదయం పరీక్షలకు మొత్తం 666 విద్యార్థులకు గాను, 640 విద్యార్థులు హాజరైనారు, 26 విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. మధ్యాహ్నం పరీక్షలకు మొత్తం 503 విద్యార్థులకు గాను, 490 విద్యార్థులు హాజరైనారు, 13 విద్యార్థులు గైర్హాజరైనారు. మొత్తం 1169 మందికి 1130 మంది హాజరయ్యారు, 39 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా,జిల్లా పరీక్షల కమిటీ సభ్యులునరేంద్రకుమార్, శ్రీనివాసులు ఐదు సెంటర్లు,ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ లు ఐదు సెంటర్లు తనిఖీ చేశారు.



ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న డిఐఈఓ

# రేవంత్ ప్రభుత్వంలో విద్య వైద్యానికి పెద్దపీట

● సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య ● దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి

**చిన్నచింతకుంట, ఫిబ్రవరి8 ప్రభాతవార్త:** రేవంత్ సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం కొౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలోని మౌలిక వసతులను కల్పనను గాలికి వదిలేసిందని ఆయన విమర్శించారు.ఉపాధ్యాయుల కొరతతో విద్యా వ్యవస్థ కుంటుపడి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు దూరమయ్యారని తద్వారా ఆర్థిక ఇబ్బందులు ఉన్న తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టామని అదే విధంగా ఉపాధ్యాయుల కొరతనుతీర్చి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పెద్దపీట వేశామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని ఆయన దుయ్య



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్



విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

బట్టారు. ఆర్థిక కష్టాలు ఉన్న ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు.పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడి లేకుండా రాసినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. పది పరీక్షల్లో ఒత్తిడి లేకుండా రాసేందుకు తన సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్‌ను అనుభవజ్ఞ లతో తయారుచేసి విద్యార్థులకు అందిస్తున్నామని అని తెలిపారు. రాబోయే పదవ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ప్రభుత్వానికి,గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. అనంతరం సమీప గ్రామాల నుంచి ప్రభుత్వ పాఠశాలకు నడుచుకుంటూ వచ్చే విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కథలప్ప, శ్రీ కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గౌని గోవర్ధన రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కోట్ల తిరుపతిరెడ్డి, సీసీ కుంట, కౌకుంట్ల మండల పార్టీ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి,నాయకులు అరవింద్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి,మాజీసర్పంచ్ శ్రీనివాసులు, మహిపాల్‌రెడ్డి, బాబు రెడ్డి, తంగిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కే బాబు, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి, మురహరియాదవ్ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీ జెండా ఎగరేద్దాం

● జనరల్ సీట్లలో బీసీ అభ్యర్థులను బరిలో దించుతాం ● బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ జెండా ఎగరేయాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం వచ్చే ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. అన్ని జనరల్ సీట్లలో బీసీ అభ్యర్థులను బరిలో దించుతామని, బీసీ పొలిటికల్ జెఎసి తరపున వారికి సహాయ సహకారాలు అందించడంతో పాటు వారిని గెలిపించుకునే బాధ్యత కూడా మేమే తీసుకుంటామన్నారు.బీసీలు పార్టీల వారీగా విడిపోకూడదని, కచ్చితంగా గెలిచేలా వ్యూహాత్మక ఎత్తుగడలు ఫాలో కావాలని వివరించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీల మధ్య చిచ్చు పెట్టేందుకు కొందరు అగ్రకుల నాయకులు కుట్రలు చేస్తుంటారని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజ్యాధికారానికి మూలం స్థానిక సంస్థలని, వాటిని చేజిక్కించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలు ఏకమై బీసీ అభ్యర్థులు గెలిచేందుకు బీసీ కులాల ఐక్యం కావాలని కోరారు.



మాట్లాడుతున్న బిసి స్టేట్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల

ప్రజల కోసం పనిచేసే వారిని ప్రజలే గెలిపిస్తారని, ప్రజల సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల కోసం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి మండల అధ్యక్షుడు రమేష్‌సాగర్, నాయకులు మ్యాదరి రాజు,కురువ నరసింహ, బోయ చెంద్రాయుడు, కుమ్మరి రాజు, చాకలి సాయులు, తిరుపతయ్య, దిండు శివసాగర్, మూలమల్ల రాజు, ఉదరి కృష్ణయ్య, ఉప్పరి చెంద్రాయుడు, నవీన్, సత్యన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మెడల్స్ సాధించిన పోలీసులకు ఘన సన్మానం



మెడల్స్ సాధించిన పోలీసులతో పదవ బెటాలియన్ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్లు, రిజర్వు ఇన్స్పెక్టర్లు

**ఇటిక్యాల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** జనవరి 28 నుండి ఫిబ్రవరి 1 వరకు కరీంనగర్ జిల్లాలో జరిగిన మూడవ రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో ఎర్రవల్లి లోని పదవ బెటాలియన్ పోలీసులు పాల్గొని 16 మెడల్స్ సాధించడం గొప్ప విషయమని అలాగే బెటాలియన్ పేరు ప్రఖ్యాతలు తీసుకు రావడం అభినందనీయమని పదవ బెటాలి యన్ కమాండెంట్ సాంబయ్య అన్నారు.పదవ బెటాలియన్ పోలీసులు 16మెడల్స్ సాధించడంతో శనివారం కమాండెంట్ సాంబయ్య. అసిస్టెంట్ కమాండెంట్లు.. పోలీసులు ఎర్రవల్లి చౌరస్తాలో డీసీఎం వాహనంపై మెడల్స్ సాధించిన పోలీసులచే విజయోత్సవ ర్యాలీ కార్యక్రమం నిర్వహించి బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో 10వ బెటాలియన్ నుండి5 గోల్డ్ మెడల్స్, 4 సిల్వర్ మెడ ల్స్ మరియు 7 బ్రాంజ్ మెడల్స్ కలిపి 16 మెడల్స్ పోలీస్ సిబ్బంది సాధించినట్లు పదవ బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య తెలిపారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన పోలీసులకు కమాండెంట్ సాంబయ్య మరియు అడిషనల్ కమాండెంట్ జయరాజు మెడల్స్ సాధించిన వారిని ఘనంగా శాలువతో సన్మానించి, జ్ఞాపికను అందించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ లు నరేందర్ రెడ్డి. శ్రీనివాసులు.రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఆర్పి సింగ్. వెంకటేశ్వర్లు. రమేష్ బాబు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ. ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు..

## ఉత్తమ ఫలితాలు సాధించాలి

మోడల్ స్కూల్ అడిషనల్ డెరెక్టర్ శ్రీనివాసాచారి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

**పెబ్బేర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** పెబ్బేర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను అడిషనల్ డెరెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కళాశాలలో జరుగుతున్నప్రాక్టికల్స్ ను పరిశీలించారు. జాతీయ స్థాయిలో క్రికెట్ లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిరోజు వేకువ ఝామునే లేచి కఠినమయిన సబ్జెక్ట్ లను సాధన చేయాలని ఉపాధ్యాయులు ఇచ్చిన ముఖ్యమైన ప్రశ్నలను సాధన చేయాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.ప్రిన్సిపాల్ స్టాఫ్‌పిల్లల అభివృద్ధికి బాటలు వేయాలని మోడల్ స్కూల్ ఎన్ రోల్ మెంట్ ను పెంచడానికి కృషి చేయాలని సూచించారు. ఇంగ్లీష్ ల్యాబ్ ను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డెరెక్టర్ దుర్గాప్రసాద్,ఎ.ఎ.ఎమ్ ఓ రవికుమార్ ,యం.ఈ.ఓ జయరాములు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ డా.తూర్పింటినరేశ్‌కుమార్,అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

**మద్దూర్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మద్దూరు మండల కేంద్రంలో పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ వాన దారులు తమ వాహనాల యొక్క ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ డ్రైవింగ్, చిన్నపిల్లలు డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం జరుగుతుందని అన్నారు. ఫైన్లు కట్టకుండా చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ప్రజలు వివిధ సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామచందర్, కానిస్టేబుల్ రమేష్, రవి నాయక్ పాల్గొన్నారు.

## 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పిడిఎస్ రైస్ పట్టుకున్న పోలీసులు

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి8 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో అప్పిరెడ్డిపల్లికి చెందిన అనంతయ్య అనే వ్యక్తి చుట్టుపక్కల ఇళ్ల నుండి రేషన్ బియ్యం సేకరించి సుభాష్ రోడ్‌లో రేకుల షెడ్డులో నిల్వ చేస్తుంటే టాస్క్ ఫోర్స్, నారాయణపేట పోలీసులు దాడులు నిర్వహించి 20 బ్యాగ్ లు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.డిటి కాలప్ప పంచనామా అనంతరం అనంతయ్య పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై అంజిలయ్య తెలిపారు. నారాయణపేట జిల్లాలో అక్రమంగా పిడిఎస్ రైస్ నిల్వ ఉంచిన, రవాణా చేసిన, ఇతరుల ఆమ్మిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## కర్ని మండల సాధనకు కలిసి ముందుకు సాగుదాం

**మక్తల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని అతిపెద్ద గ్రామమైన కర్ని తక్షణమే నూతన మండలంగా ఏర్పాటు చేసేంత వరకు చుట్టుపక్కల గ్రామాల మేధావులు, యువత, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కలిసి ముందుకు సాగుదామని కర్ని మండల సాధన సమితి నాయకులు పేర్కొన్నారు.కర్ని మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం మక్తల్ మండలంలోని పసుపుల, పంచదేవ్ పహాడ్, పారేవుల, ముస్లాయిపల్లి, దాదనపల్లి, అనుగొండ, అంకెన్ పల్లి, భగవాన్ పల్లి, చిన్న గోప్లాపూర్, పంచ లింగాల,ఎర్ర న్‌పల్లి గ్రామాల్లో ప్రజల మద్దతు కోరుతూ సమావేశాలు నిర్వహించారు.ఆయా గ్రామాల్లోని ప్రజలు వారికి సాదర స్వాగతం పలు కుతూ కర్ని మండల ఏర్పాటుకు ఆయా గ్రామాల్లో ఏకవాక్య తీర్మానాలను చేసి నాయకులకు అందించారు.కృష్ణానది తీరాన ఉన్న గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కర్ని కేంద్రం గా నూతన మండలాన్ని ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉందనినాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు,యువత పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శ్రీరాములు

**బిజినేపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** వట్టెం జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరానికై 9,11వ తరగతిలోని పరిమిత ఖాళీల భర్తీకై నిర్వహించిన ప్రవేశపరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసిందని విద్యాలయ ప్రిన్సిపల్ పి.భాస్కర్ కుమార్ తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తము3369 మంది అభ్యర్థులకు గాను 2833 మంది హాజరయ్యారు 536 గైర్హాజరయ్యారు. తొమ్మిదవ తరగతి ప్రవేశ పరీక్షకు 1647మంది అభ్యర్థులకుగాను 1328 మంది హాజరు కాగా 319 గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల రెవెన్యూ పోలీస్ సంబంధిత శాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

## ఢిల్లీలో కాంగ్రెస్ ఓటమికి రేవంత్‌రెడ్డే కారణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**కొత్తకోట, ఫిబ్రవరి8 ప్రభాతవార్త:** ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతో చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ కనీసం ఖాత ఓపెన్ చేయకపోవడం విషాదకరమని అందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే కారణమని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, రాయినిపేట మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాసులు ఆరోపించారు.శనివారం కొత్తకోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఎక్కడ అడుగు పెడితే అక్కడ కాంగ్రెస్ పార్టీకి ఓటమి చూస్తుందని గుర్తు చేశారు. మొన్నటికి మొన్న కర్ణాటక ఎన్నికల్లో కూడా సీఎం రేవంత్ రెడ్డి అక్కడ ప్రచారం చేయడంతో అక్కడ కూడా ఓటమి పాలయ్యిందని చెప్పారు. ఎంతో చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి వల్ల తుడిచిపెట్టే పరిస్థితి భవిష్యత్తులో రాబోతుందని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా రేవంత్ రెడ్డి 420 హామీలు ప్రజలకు ఇచ్చి మోసం చేశాడని గుర్తు చేశారు. మోసపోయిన ప్రజలుఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారని విమర్శించారు. దొంగ హామీలతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. వచ్చే స్థానికుల ఎన్నికలో రాష్ట్రంలో కెసిఆర్ వైపు చూస్తారని అత్యధిక స్థానాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## ధ్యానం సర్వరోగ నివారిణి

**చిన్నంబావి, ఫిబ్రవరి8 ప్రభాతవార్త:** ధ్యానం సర్వరోగ నివారిణి అని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త మునగాల ప్రవీణ్ అన్నారు. శనివారం చిన్నంబాయి మండలపరిధిలోని పెద్దమారుర్, చిన్నమారుర్,వెల్టూరు గ్రామాలలో ధ్యాన్యం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గుండె జబ్బులు, బిపి,షుగర్, వ్యాధులను ధ్యానం చేసి తగ్గించుకోవచ్చని అన్నారు.మోకాళ్ళ నొప్పులను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు ధ్యానం చేసే పద్ధతిపై శిక్షణ నిచ్చి అవగాహన కల్పించారు. నిత్యజీవితంలో అనేక సమస్యలతో సతమతమవుతూ ఎదుర్కొనే ఒత్తిడి నుంచి ధ్యానం చేసి బయట పడగలుగుతామని వారు అన్నారు. అనేక మానసిక రుగ్మతల నుంచి బయటపడతామని అన్నారు. శ్వాస మీద ధ్యాస అనే ధ్యానం చేసి తాము పొందిన అనేక శారీరిక మానసిక లాభాల గురించి ప్రజలకువివరించారు. ధ్యానం చేయడం ద్వారారోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. చిన్నప్పటినుంచి ధ్యానం చేస్తే భవిష్యత్తులో వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, తిరుపతయ్య, ప్రవీణ్, కృష్ణ మదిలేటి, రాజేశ్వరి, శైలజ, వెంకటలక్ష్మి సుభద్ర, శోభిత, నౌసిక్, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ గెలుపు దేశానికి మలుపు

జోలాంబ గద్వాల జిల్లా బిజెపి అధ్యక్షులు రామచంద్ర రెడ్డి



**అయిజ, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** ఢిల్లీ గెలుపుతో దేశానికి మలుపు అని జోలాంబ గద్వాల జిల్లా బిజెపి అధ్యక్షులు రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. శనివారం వెలువడిన ఢిల్లీ రాష్ట్ర ఎన్నికల ఫలితాలలో భారతీయ జనతా పార్టీ అఖండ మెజార్టీతో గెలుపొందడంతో భారతీయ జనతాపార్టీ పట్టణ అధ్యక్షులు కంపాటి భగత్‌రెడ్డి, మండలఅధ్యక్షులు గోపాలకృష్ణల ఆధ్వర్యంలో స్థానిక బిజెపి నాయకులతో కలిసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ కార్యాలయంలో మిఠాయిలు పంచుకొని, బాణసంచా పేల్చారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 27 ఏళ్ల తర్వాత తర్వాత కాషాయం జెండా ఎగరవేసి ఢిల్లీ గడ్డ బిజెపి అడ్డా అయిందన్నారు మొన్న హర్యానా, నిన్న మహారాష్ట్ర, నేడుఢిల్లీ ఈవిధంగా బిజెపి గెలుపు పరంపర కొనసాగుతుందని, రాబోయే బీహార్ ఎన్నికల్లో గాని, తెలంగాణ, కర్ణాటకలో, హిమాచల్ ప్రదేశ్‌లో భారతీయ జనతాపార్టీ గెలుపు తథ్యమనీ అదే విధంగా కాంగ్రెస్ ముక్త భారత్ అని ప్రజలు నిర్ణయించారని ఆ విధంగానే కాంగ్రెస్ పార్టీ దేశంలోని అన్నిరాష్ట్రాలలో తుడిచి పెట్టకపోతుందని, ఇప్పుడు కేవలం కర్ణాటక, తెలంగాణలో హిమాచల్ ప్రదేశ్ ఈ మూడు రాష్ట్రాల్లో మాత్రమే కాంగ్రెస్ పార్టీ ఉందని ఈ రాష్ట్రాలలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా, కాంగ్రెస్ ఓడి బిజెపి గెలుపు తధ్యమని, దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో, వికసిత్‌భారత్ లక్ష్యంగాపనిచేస్తున్నారన్న నమ్మకంతో, యువత, మహిళలు, కార్మికులు, కర్షకులు రైతులు, మేధావులు, బడుగు బలహీన వర్గాలు, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ నరేంద్ర మోదీ సుభిక్ష, సురక్ష పరిపాలన అందించడంలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదగడం చూసి, భారతరత్న విశ్వగురు స్థానానికి లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి నాయకత్వాన్ని విశ్వసించి దేశనలుమూలల భారతీయ జనతాపార్టీకి పట్టం కడుతున్నారన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడి కొండ భీమ్‌సేన్ రావు, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు వీరయ్య చారి, లక్ష్మణాచారి, బెల్లంకొండ నాగరాజు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ యాదవ్, చిన్ని కృష్ణ, కనికే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఊర్కొండ ఎస్ఐగా పి.కృష్ణదేవ బాధ్యతలు స్వీకరణ



**ఊర్కొండ, ఫిబ్రవరి8 ప్రభాతవార్త:** ఊర్కొండ మండల ఎస్ఐగా పి.కృష్ణ దేవ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఊర్కొండ ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తించిన వీరబాబు బదిలీపై వెళ్లడంతో శనివారం ఊర్కొండ మండల నూతన ఎస్ఐగా పి.కృష్ణదేవ బాధ్యతలు స్వీకరించారు. అనం తరం పోలీస్ సిబ్బంది నూతన ఎస్ఐని సన్మానించి హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు.

